నారాయణఖేడ్‌లో ఎడతెరిపి లేని వర్షం

నారాయణఖేడ్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ప్రాంతంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు కురియడంతో జనాలు ఇబ్బందులకు గురయ్యారు. డివిజన్‌లో వారం రోజులుగా ప్రతీ రోజు వర్షం కురుస్తున్నది. ఎడతెరిపి లేని వానలకు చేతికందే దశలో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. దీనికితోడు ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పండుగల వేళ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని దుకాణదారులు వాపోతున్నారు.

తీరిన టీచర్ల సర్దు'పాట్లు'

- సంగారెడ్డి జిల్లాల్లో మరో 63 మంది
- ఉత్తర్వులు విడుదల చేసిన సంగారెడ్డి డీఈవో

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఈమేరకు డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతుల అనంతరం ఏర్పడిన ఖాళీలను పూరించడానికి 63 మంది ఉపాధ్యాయులను సర్దుబాటుపై ఇతర పాఠశాలలకు కేటాయించారు. మరో 22 మంది సర్దుబాటు ఉత్తర్వుల్లో మార్పులు చేర్పులు చేసి అవసరమైన పాఠశాలకు మళ్లీ కేటాయించారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎనిమిది మంది సర్దుబాటు ఉత్తర్వులను ఈ జాబితాలో రద్దు చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఈ నెల 4వ తేదీ వరకు పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించినప్పటికీ వివిధ కారణాలతో జాప్యం జరిగింది.



గేటు పడుద్ది.. రోజుకు 30సార్లు

జహీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్ ప్రాంత ప్రజలకు రైల్వే గేట్లతో చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజలు వ్యాపార, వాణిజ్య, వైద్య, విద్య తదితర అవసరాల కోసం పక్కనే కర్నాటక రాష్ట్రం బీదర్ పట్టణానికి ఎక్కువగా వెళ్తుంటారు. జహీరాబాద్-బీదర్ మధ్యలో రెండు రైల్వేగేట్లు ఉన్నాయి. ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు కలిపి రోజుకు 30 రైళ్లు వెళ్తుంటాయి. రైలు వచ్చినప్పుడల్లా పది నిమిషాలైనా రైల్వే గేట్లు మూసేస్తారు. గేటు పడినప్పుడు ఇరువైపులా నిలిచిపోయిన ట్రాఫిక్ క్లియర్ కావడానికి మరో పది నిమిషాలైనా పడుతుంది. ఇలా నిత్యం రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి సమయం వృథా అవుతున్నది. రైల్వే గేట్ల స్థానంలో ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తే అగచాట్లు తప్పుతాయని ప్రజలు కోరుతున్నారు.

గాంధీభవన్‌లో బతుకమ్మ సంబరాల్లో

పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద గురువారం మహిళా కాంగ్రెస్ ఆధ్వరంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ ప్రతినిధులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ తీరొక్క పూలను పూజించే



గాంధీభవన్ వద్ద బతుకమ్మ ఆడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



గాంధీభవన్ వద్ద మహిళా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ఉన్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో మహిళలందరు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి ఆకాంక్షించారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వైద్య శిబిరాల్లో మెరుగైన సేవలు

విస్తృత ప్రచారం చేయాలి : మెదక్ కలెక్టర్

టేక్మాల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. టేక్మాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోడల్ స్కూల్, కేజీబీవీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు, స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారా అని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక వైద్య శిబిరాల గురించి ముందుగానే విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. వైద్య సేవలు అవసరమైనవారికి ప్రత్యేక వైద్య నిపుణుల సేవల గురించి వివరించి శిబిరాలకు తరలించాలని సూచించారు. మెరుగైన ఆరోగ్య సేవలు అవసరమైనవారిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, గుణాత్మక విద్య అందించేందుకు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

మైనారిటీ పథకాలకు దరఖాస్తులు

జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి విశాలాక్షి



విశాలాక్షి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమం కోసం మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ రెండు నూతన పథకాలను ప్రారంభించిందని సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మైనారిటీ సంక్షేమాధికారి విశాలాక్షి తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద నిరాశ్రయులు, అనాథలు, వితంతువులు ఒంటరి మహిళలకు చిన్న వ్యాపారాల కోసం రూ.50 వేల సాయం చేయనున్నట్లు తెలిపారు. రేవంతన్నకా సహారా మిస్కినోకే లియే కోసం ఫకీర్, దుదేకుల, దుర్బల ముస్లిం సమాజవర్గాలకు మోపెడ్ వాహనాల కోసం రూ.లక్ష గ్రాంట్ ఇవ్వనున్నట్లు వివరించారు. అర్హత కలిగినవారు అక్టోబరు 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9032122939 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం దందా..

సంగారెడ్డి జిల్లాలో జోరుగా అక్రమ రవాణా

ఈ నెల 3న మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. పోలీసులు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా రేషన్ బియ్యాన్ని గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నారు.

ఈ నెల 9న మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు.

ఈ నెల 10న జహీరాబాద్ పట్టణం మాడ్గి గ్రామ శివార్లలోని ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ వద్ద రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నారు. 311 క్వింటాళ్ల బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు.

- ఇంటింటికి తిరుగుతూ సేకరణ
- పెద్దఎత్తున నిల్వ చేసి లారీల్లో తరలింపు
- పొరుగు రాష్ట్రాల్లో అధిక ధరకు విక్రయం
- రెండేళ్లల్లో 126 కేసులు నమోదు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పరిధిలో నిత్యం ఏదో ఒకచోట అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడుతూనే ఉన్నది. జిల్లాలో జాతీయ రహదారులతో పాటు అంతర్ జిల్లా రహదారులు ఉండటంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం సరిహద్దులు దాటుతున్నది. పట్టణాలు, గ్రామాల్లో దళారులు ఇంటింటికి తిరుగుతూ కిలో రూ.15 చెల్లించి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వారి నుంచి మరొకరు.. ఇలా గొలుసుకట్టు విధానంలో ఇద్దరు ముగ్గురి చేతులు మారుతున్నది. చివరకు ఒకచోట నిల్వ చేసి ఒకేసారి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడంలో డీలర్ల హస్తం కూడా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సన్నబియ్యం పంపిణీ చేయడంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించినా ఈ దందా కొనసాగుతూనే ఉంది.

వందల్లో కేసులు

సంగారెడ్డి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై రెండేళ్లల్లో 126 కేసులు నమోదయ్యాయి. 2024లో తనిఖీల్లో 9642.57 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అక్రమార్కులపై 73 కేసులు నమోదు చేశారు. 2025లో ఇప్పటివరకు 53 కేసులు నమోదు చేసి 7014 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.



తనిఖీల్లో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసేవారిపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదుకు సిఫారసు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా పౌరసరఫరాల శాఖకు సంబంధించిన ఎనిమిది మంది డిప్యూటీ తహసీల్దార్లు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. పర్యవేక్షణ మరింత పెంచుతాం.

- జి.బాలసరోజ, సంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

గ్రూప్-1లో మనోళ్ల సత్తా

సవాళ్లను అధిగమించి విజయతీరాలకు చేరిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

7

ఆటో డ్రైవర్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు

ఐఐటీహెచ్‌లో భవిష్యత్ తరం చిప్‌ల డిజైన్

- 75కు పైగా సెమీకండక్టర్ డిజైన్ల అభివృద్ధి
- మొబైల్ నావిగేషన్, డ్రోన్లు, రక్షణ వ్యవస్థల.. సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా రూపకల్పన
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకుల ఘనత

7



ఏడుపాయలలో శరన్నవరాత్రి పూజలు

వనదుర్గ అలంకారంలో అమ్మవారు

పాపన్నపేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం ఏడుపాయలలో అమ్మవారు వనదుర్గా మాత అలంకారంతో ఆకుపచ్చ వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

కమీషన్ ఇవ్వండి

- రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా బకాయిలు
- దసరా, దీపావళి పండగలు కూడా చేసుకోలేని పరిస్థితి
- ప్రధాన మంత్రికి రేషన్ డీలర్ల అధ్యక్షుడి లేఖ



ప్రధానికి లేఖ రాసిన ఆనంద్

నర్సాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ రాకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దసరా, దీపావళి పండుగలు కూడా చేసుకోలేని పరిస్థితి ఉన్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మెదక్ జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి ఆనంద్ లేఖ రాశారు. ఈ విషయాన్ని ఆయన గురువారం వెల్లడించారు. ఐదు నెలలుగా కమీషన్ అందకపోవడంతో దసరా పండుగకు పిల్లలకు దుస్తులు కూడా కొనలేకపోతున్నామని ఆయన వాపోయారు. ప్రధాని దృష్టిసారించి కమీషన్ విడుదల చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఒకే కమీషన్ విధానాన్ని అమలు చేయాలని లేఖలో విన్నవించారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ఆనంద్‌ను సంప్రదించగా కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితులో ఉండటంతో చేసేది లేక నేరుగా పీఎంకు లేఖ ద్వారా తమ గోడు వెల్లబుచ్చానని తెలిపారు. కనీసం ఇలా అయిన తమ డీలర్ల బతుకులు బాగుపడుతాయని ఆశిస్తున్నట్టు చెప్పాడు.

కొత్త మద్యం దుకాణాలొస్తున్నాయ్..!

- నేటి నుంచి అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఫీజు రూ.3 లక్షలకు పెంపు
- డిసెంబర్ 1 నుంచి అమలులోకి కొత్త దుకాణాలు
- భారీగా దరఖాస్తులు వస్తాయని అంచనా.. ఆదాయంపై ఆశలు



సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. నేటి నుంచే దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటిస్తూ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏడాది నవంబరు చివరి వరకు ప్రస్తుత లైసెన్స్‌దారుల గడువు ఉన్నా.. మూడు నెలల ముందుగానే మద్యం షాపులకు టెండర్లను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. రెండేళ్ల కాలపరిమితికి మద్యం దుకాణాలకు అనుమతుల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు రుసు రూ.3 లక్షలుగా నిర్ధారించింది. అక్టోబరు 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 23వ తేదీన లక్కీడ్రా పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయిస్తారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త మద్యం దుకణాలు తెరుచుకుంటాయి.

రిజర్వేషన్ల కొనసాగింపు

మద్యం దుకాణాల కేటాయింపులో కులాలవారీగా రిజర్వేషన్లు కల్పించనున్నారు. గౌడ్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ అమలు చేయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 101 మద్యం దుకాణాలుండగా, ఎస్సీలకు 13, ఎస్టీలకు 2, గౌడ్‌లకు 9 కేటాయించారు. మిగతా 77 దుకాణాలను జనరల్‌కు కేటాయించారు. మెదక్ జిల్లాలో 49 షాపులు ఉండగా గౌడ్‌లకు 9, ఎస్సీలకు 6, ఎస్టీలకు ఒక దుకాణాన్ని కేటాయించారు. 33 దుకాణాలను ఓపెన్ కేటగిరీగా నిర్ణయించారు. రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. ఎక్సైజ్ చట్టం-1968 ప్రకారం శిక్ష పడినవారు, ప్రభుత్వానికి బకాయిలు ఉండి సక్రమంగా చెల్లించని వారు మద్యం దుకాణాలు పొందేందుకు అనర్హులుగా ప్రకటించింది.

రూ. 161.22 కోట్ల ఆదాయం

నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం సంగారెడ్డి జిల్లాలో 101, మెదక్‌లో 49 మద్యం దుకాణాలున్నాయి. రెండేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లాలో మద్యం దుకాణాల కోసం 6,156 దరఖాస్తులు రాగా.. ప్రభుత్వానికి రూ.123.12 కోట్ల ఆదాయం సమకూరింది. మెదక్ జిల్లాలో 49 మద్యం దుకాణాలకు 1,905 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ శాఖకు రూ.38.10 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. 2023లో రెండేళ్ల కాలపరిమితితో అనుమతులు మంజూరు చేశారు. అప్పట్లో సంగారెడ్డి, మెదక్ రెండు జిల్లాల్లో ప్రభుత్వ ఖజానాకు రూ. 161.22 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం దరఖాస్తు ఫీజు పెంచడంతో ఈమేరకు ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ప్రజల కోసమే జీఎస్టీ సంస్కరణలు

● ఎమ్మెల్సీ అంజిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు ప్రజల ప్రయోజనాల కోసమేనని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ అధ్యక్షతను ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలను కాంగ్రెస్ పార్టీ తట్టుకోలేకపోతుందన్నారు. అంతకుముందు జనసంఘ్ వ్యవస్థాపకుడు, పార్టీ సిద్ధాంతకర్తల్లో ఒకరైన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్ రాజేందర్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు ఎంఎల్ఎన్‌రెడ్డి, విజయ్ తదితరులున్నారు.



పంట రాకముందే..

కల్హేర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో, రైళ్లలో సీటు కోసం ముందస్తుగానే దస్తీ వేయడం తెలిసిందే. ఇక్కడ రైతులు కూడా రోడ్డుపై చెట్ల కొమ్మలు వేసి స్థలాన్ని రిజర్వు చేసుకుంటున్నారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత ఆరబెట్టుకోవడానికి స్థలం దొరకక ఇబ్బంది పడాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఇలా చెట్ల కొమ్మలు వేశారు. కల్హేర్ నుంచి ఇందిరానగర్ వెళ్లే రోడ్డులో సుమారు కిలోమీటరు పొడవున పలువురు రైతులు ఇలా కొమ్మలు వేయడం కనిపించింది. ఇదేమిటని రైతులను ప్రశ్నిస్తే ధాన్యం రావడానికి సమయం ఉన్నా.. తీరా వచ్చిన తర్వాత ఆరబెట్టుకోవడానికి స్థలం దొరకకపోతే ఇబ్బంది పడుతామని, అందుకే ఇలా రిజర్వు చేసుకుంటున్నామని చెప్పారు. అయితే, రోడ్లపై ధాన్యం, ఇతర పంటోత్పత్తులు ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

భూభారతి ఆర్జీలను త్వరతగతిన పరిష్కరించండి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు.25 (ఆంధ్రజ్యోతి): భూభారతి పెండింగ్ ఆర్జీలను త్వరతగతిన పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆర్డీవో, తహసీల్దార్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు అవసరమైన పూర్తి వివరాలను జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో నుంచి ఆర్డీవో కార్యాలయానికి అటు నుంచి కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. నిర్ణీత గడువులోగా అన్ని దరఖాస్తులను పరిష్కరించేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరిస్తే అందుకు గల కారాణాలను స్పష్టంగా తెలపాలని సూచించారు. సాదా బైనామా పీవోటీలకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో వెళ్లి సంబంధిత స్థలాలను పరిశీలన చేసి విచారణ జరపాలని పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి, జహీరాబాద్ ఆర్డీవో దేవూజా, సంగారెడ్డి, అందోల్ ఆర్డీవోలు రాజేందర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

● ప్రభుత్వ ఉపాధ్యాయుడి బైక్ యాత్ర

చేర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): యువత మత్తుకు బానిసగా మారి ఉజ్వల జీవితాన్ని చిత్తు చేసుకోకూడదని సూచిస్తూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినూత్న తీరులో అవగాహన కల్పిస్తున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రభాకర్ ద్విచక్రవాహనంపై రాష్ట్రవ్యాప్త జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం చేర్యాల పట్టణానికి చేరుకోగా, అంగడిబజారు చౌరస్తా వద్ద యువత నుద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. దసరా సెలవులను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నానని, యువకులను చైతన్యవంతం చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈమేరకు పలువురు ఆయనను అభినందించారు.


ద్విచక్రవాహన యాత్ర చేర్యాలకు చేరుకున్న ప్రభాకర్

పరిశ్రమ మిషన్‌లో ఇరుక్కొని కార్మికుడి మృతి


అభిషేక్ మృతదేహం

గుమ్మడిదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం మంబాపూర్ శివారులోని ఎస్‌వీఎస్ పరిశ్రమలో ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మిషన్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంబాపూర్ శివారులోని ఎస్‌వీఎస్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్(22) కార్మికుడిగా పని చేస్తున్నారు. బుధవారం ఓ మిషన్ వద్ద పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కొని.. ఊపిరాడక మృతి చెందాడు. పరిశ్రమలో కార్మికులకు ఎలాంటి భద్రత చర్యలు లేకపోవడం వల్లే అభిషేక్ మృతి చెందినట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అభిషేక్ సోదరుడు అనికేత్ వర్మ ఫిర్యాదు మేరకు పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఆయన పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా అసంఘటిత రంగ కార్మికుడికి విధులు అప్పగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చల అనంతరం పరిశ్రమ యాజమాన్యం బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం, అంత్యక్రియలకు రూ. లక్ష అందించేందుకు అంగీకరించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమ ప్రతినిధులు, ఉత్తరాది సంక్షేమ సంఘం సభ్యుల సమక్షంలో మృతుని కుటుంబీకులకు పరిహారం చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్ సింగ్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


విజయ్‌కుమార్ మృతదేహం

రామచంద్రాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన కొల్లూరు ఓఆర్ఆర్‌పై గురువారం చోటుచేసుకుంది. కొల్లూరు సీఐ గణేశ్ పటేల్ కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని నాంపల్లికి చెందిన విజయ్‌కుమార్ (37) నలుగురు స్నేహితులతో కలిసి గురువారం కారులో తుల్జాపూర్ బయలుదేరారు. కొల్లూరు ఓఆర్ఆర్ జంక్షన్‌కు చేరుకునే సరికి కారు టైరు పంక్చర్ అయింది. దీంతో విజయ్‌కుమార్ మరో మిత్రుడు రాచప్ప(23) కారు వద్ద ఉండగా రమేష్(30), నందు(22), జగదీశ్వర్(32)లు టైరు పంక్చర్ వేయించడానికి ఓఆర్ఆర్ కిందకు దిగారు. కారు వద్ద ఉన్న విజయ్‌కుమార్, రాచప్పలు కారు బయట నిలుచుని ఉండగా వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని లారీ వారిని ఢీ కొని అలాగే ముందుకు వెళ్లింది. ఈ ఘటనలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, రాచప్పకు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పారా మెడికల్ విద్యార్థి ఆత్మహత్య


అనిల్‌కుమార్ మృతదేహం

హయత్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్ మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన రాయిని అనిల్‌కుమార్ (21) సామనగర్ రోడ్డు నంబర్ 10లో ఉన్న బీసీ వెల్ఫేర్ హస్టల్‌లో ఉంటూ హయత్‌నగర్‌లోని డీఎంబీటీ విజయ రీసెర్చ్ ఆఫ్ పారా మెడికల్ లేబరేటర్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం హస్టల్‌లో ఎవరు లేని సమయంలో అనిల్‌కుమార్ ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. అనిల్‌కుమార్ ఎంతకు తలుపు తీయక పోవడంతో అనుమానం వచ్చిన తోటి విద్యార్థులు తలుపులు ధ్వంసం చేసి లోనికి వెళ్లగా అనిల్‌కుమార్ వేలాడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే చికిత్స ఓ ఆసుపత్రికి తరలించగా మృతిచెందిన వైద్యులు నిర్ధారించారు. అనిల్‌కుమార్ ప్రేమవ్యవహారంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తోటలపై దాడులు


గంజాయి మొక్కలు తొలగిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మనూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న గంజాయి తోటలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 155 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన దుద్దగొండ నారాయణ తన వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించి మొక్కలను ధ్వంసం చేశారు. ఈ 155 మొక్కల విలువ సుమారు రూ.15లక్షల వరకు ఉంటుందని ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై హన్మంతుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



హవేళిఘణపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని పోచారం డ్యాం, పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులుగా 24 గంటలు ప్రజల రక్షణకు సేవ చేస్తున్నామని, పోలీసు సిబ్బంది ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల రక్షణకు బాంబ్ స్వాడ్, నార్కోటిక్ డాగ్స్‌లతో బస్టాండ్లు, దాబాలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్పీ పర్యటన అనంతరం పోలీసులు మండల కేంద్రంలోని హోటళ్లు, దాబాలు, కిరాణా షాపుల్లో బాంబ్ స్కాడ్, నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేశారు. ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.

అమ్మాయిల జోలికి వెళ్తే పోక్సో కేసులు

● మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

పాపన్నపేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిల జోలికి వెళ్తే పోక్సో కేసులు నమోదు చేస్తామని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ హెచ్చరించారు. మెదక్, అల్లాదుర్గం సర్కిల్ పరిధిలోని పోలీసులతో గురువారం మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాయుధ పోలీసుల కవాతు నిర్వహించారు. అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. పలు అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ కూడలి వద్ద జరిగిన ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్,టౌన్ సీఐ మహేశ్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సరైన పత్రాలు లేని 65 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

గ్రూప్-1లో మనోళ్ల సత్తా

సవాళ్లను అధిగమించి విజయతీరాలకు చేరిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. అనేకమంది తమ పట్టుదల, కృషి, అకుంఠిత దీక్షతో ఉన్నత స్థానాలను సాధించారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరికొందరు ఎలాంటి కోచింగ్ లేకుండానే, తమ తొలి ప్రయత్నంలోనే గొప్ప విజయం సాధించి స్ఫూర్తిగా నిలిచారు. ఈ విజేతల్లో కొందరు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నా.. ఉన్నత స్థానాల కోసం అహర్నిశలు శ్రమించి విజయతీరాలకు చేరుకున్నారు. విజయాలు వారి వ్యక్తిగత సామర్థ్యాన్ని, అంకితభావాన్ని చాటి చెప్పడమే కాకుండా, సరైన ప్రణాళికతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపించాయి.

17 ర్యాంక్ సాధించిన ప్రణయ్ సాయి

తూప్రాన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో తూప్రాన్‌కు చెందిన బోయిని పల్లి ప్రణయ్ సాయి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. టీజీపీఎస్సీ ప్రకటించిన 115 డీఎస్పీ పోస్టుల్లో ఆయన మొదటి స్థానంలో నిలిచారు. గతంలో విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 513 మార్కులతో రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయిన్ పల్లి విష్ణువర్ధన్, శ్రీవిద్య దంపతుల కుమారుడైన ప్రణయ్ సాయి ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. గతంలో గ్రూప్-4 లోనూ సత్తా చాటి జూనియర్ అసిస్టెంట్‌గా చెగుంట తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-2లో 134వ ర్యాంకు, గ్రూప్-3లో 148వ ర్యాంకు సాధించారు. తన లక్ష్యం సివిల్స్ సాధించడమేనని ప్రణయ్ సాయి తెలిపారు.



తండ్రి విష్ణుతో ప్రణయ్‌సాయి

స్వీపర్ కుమారుడికి ఎంపీడీవో ఉద్యోగం

అక్కన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పార్ట్‌టైమ్ స్వీపర్ కుటుంబం నుంచి ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలను సాకారం చేశారు. అక్కన్నపేట మండలం కట్కూర్‌కు చెందిన ఉల్లెంగుల హన్మయ్య, మల్లవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హన్మయ్య పార్ట్ టైమ్ స్వీపర్‌గా పనిచేస్తూ నలుగురు పిల్లలను చదివించారు. పెద్ద కుమార్తె స్వప్న శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్‌గా, రెండో కుమార్తె హారిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీధర్ గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్‌గా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. గ్రూప్-3లో 1644వ ర్యాంక్ సాధించిన అతడు తాజాగా గ్రూప్-1లో 864వ ర్యాంకు సాధించి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. తండ్రి కష్టానికి ఫలితం దక్కినందుకు సంతోషంగా ఉందని శ్రీధర్ తెలిపారు. హన్మయ్య చిన్న కుమారుడు ఉల్లెంగల శ్రీకాంత్ ఎంబీఏ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. తండ్రి పార్ట్‌టైం స్వీపర్‌గా పనిచేసి నానా కష్టాలు పడి నలుగురు పిల్లలను చదివించాడు. పిల్లలు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఉల్లెంగుల శ్రీధర్

ఎలాంటి కోచింగ్ లేకుండానే..

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ర్యాంకుల్లో మెదక్ పట్టణానికి చెందిన పూన శైలేష్ సత్తా చాటి తండ్రి కల నేరవేర్చాడు. ఎలాంటి కోచింగ్ లేకుండానే తొలి ప్రయత్నంలోనే 41వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రోజుకు 10-12 గంటలు చదివి పట్టుదలతో తన ప్రతిభను చాటినట్లు తెలిపాడు. మెదక్ పట్టణానికి చెందిన పూన రవి, ఝాన్సీ దంపతుల పెద్ద కుమారుడు ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. ఎంఏ చేస్తూ.. ఎవరి దగ్గర శిక్షణ తీసుకోకుండానే ఈ ఘనత సాధించారు. శైలేష్‌కు బంధువులు, పట్టణ వాసులు శుభాకాంక్షలు తెలిపారు.



తల్లిదండ్రులతో పూన శైలేష్

సిద్దిపేట యువకుల సత్తా..

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 1 ఫలితాల్లో సిద్దిపేటకు చెందిన యువకులు సత్తా చాటారు. పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన నర్రా భగవాన్ రెడ్డి, వజ్రమ్మ దంపతులు కుమారుడు నర్రా అఖిల్ రెడ్డి 75వ ర్యాంకు సాధించాడు. ఇంటర్మీడియట్ వరకు సిద్దిపేటలో చదివిన అఖిల్, బీటెక్, ఎంటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ఇంతకుముందు సివిల్స్ రాసి రెండు సార్లు మెయిన్స్ వరకు వెళ్లాడు. ఆ తర్వాత ఇంజనీరింగ్ టెక్నికల్ ఎగ్జామ్స్ క్లియర్ చేసి ప్రస్తుతం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వీవీ రావు-జయశ్రీ దంపతుల కుమారుడు అరుణ్‌చంద్ర 147 ర్యాంకు సాధించాడు. వరంగల్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అరుణ్ చంద్ర రెండుసార్లు సివిల్స్ మెయిన్స్ వరకు వెళ్లాడు. ప్రస్తుతం గ్రూప్-1లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపికయ్యారు.



అఖిల్ రెడ్డి ,అరుణ్ చంద్ర

పట్టుదలతో చదివి..

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం మూసాపేట గ్రామానికి చెందిన ఎరగారి ప్రభాత్ రెడ్డి గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. గతంలో నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 73వ ర్యాంకు సాధించారు. ప్రభాత్‌రెడ్డి తండ్రి శశీరంధ్‌రెడ్డి పీఏసీఎస్ డైరెక్టర్. ప్రభాత్‌రెడ్డి చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండి పదవ తరగతిలో 9.8 జీపీఏ సాధించారు. బీటెక్‌లో సీజీపీఏ 9.0తో ఉత్తీర్ణత పొందారు. గ్రూప్-4లో సత్తా చాటిన ప్రభాత్‌రెడ్డి ప్రస్తుతం రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన కృషి, పట్టుదలతో గ్రూప్-1లో విజయం సాధించారని ఆయన తెలిపారు.



ప్రభాత్‌రెడ్డి

డీఎస్పీగా గంగాపూర్ యువకుడు

చిన్నకోడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన నరిగే స్వామి యాదవ్ గ్రూప్-1 లో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో 95వ ర్యాంకు సాధించి డీఎస్పీ (సివిల్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రయ్య, కనకవ్వ దంపతుల కుమారుడైన స్వామి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. బాసర ఐఐఐటీలో చదివి, ఆ తర్వాత ప్రైవేటు ఉద్యోగం చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమై 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి, ఆ తర్వాత రాజీనామా చేశారు. ఇటీవల గ్రూప్-2లో 116వ ర్యాంకు, గ్రూప్-3లో 52వ ర్యాంకు సాధించారు. ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని స్వామి తెలిపారు.



పంచాయతీ కార్యదర్శి నుంచి డీఎస్పీ వరకు..

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్య శ్రీకాంత్ నిరూపించారు. టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఆయన డీఎస్పీగా ఎంపికయ్యారు. లావుడ్య సోమ్లా, లక్ష్మి దంపతుల కుమారుడైన శ్రీకాంత్ చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి కనబర్చాడు. 2018 లో పంచాయతీ కార్యదర్శిగా, రెండు నెలల తర్వాత వీఆర్వోగా ఉద్యోగాలు సాధించారు. అయినా సంతృప్తి చెందక ఎస్సై కావాలనే లక్ష్యంతో కృషి చేశారు. ఎస్సై పరీక్షల్లో మంచి మార్కులు సాధించి మొదట చందుర్తిలో ఎస్సైగా పనిచేశారు. జోనల్ వ్యవస్థ మార్పులో భాగంగా ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీరావుపేటలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సైగా పనిచేస్తూనే గ్రూప్-1 పరీక్షలు రాసి 900 మార్కులకు 489 మార్కులు సాధించి 89వ ర్యాంకు పొందారు. తాజాగా విడుదలైన జాబితాలో ఆయనకు డీఎస్పీ పోస్టు లభించింది. శ్రీకాంత్ విజయంపై ఆయన కుటుంబ సభ్యులు, తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు.



స్వామి

ఎంపీడీఓగా బానోతు ప్రవీణ్

కోహెడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బానోతు ప్రవీణ్ గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. బుధవారం రాత్రి వెలువడిన ఫలితాల్లో ప్రవీణ్‌కు 452 మార్కులు వచ్చాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన మంతు-లక్ష్మి దంపతుల కుమారుడైన ప్రవీణ్ అస్సాంలోని గౌహతిలో ఐఐటీ పూర్తి చేశారు. సివిల్స్ కోసం సిద్ధమవుతూనే గ్రూప్-1 పరీక్ష రాసి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.



భానోత్ ప్రవీణ్

దుబ్బాకవాసి..

దుబ్బాక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో దుబ్బాకకు చెందిన బైండ్ల వెంకటేష్ సత్తా చాటారు. మొదటి ప్రయత్నంలోనే 453 మార్కులతో రాష్ట్రస్థాయిలో 543వ ర్యాంకు సాధించి మల్టీ జోన్-2లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పోస్టుకు ఎంపికయ్యారు. వెంకటేష్ తండ్రి బైండ్ల నారాయణ సంగారెడ్డి శివారులోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ రిటైర్డ్ ఉద్యోగి కాగా, తల్లి రేణుక గృహిణి. వెంకటేశ్ చదువంతా సంగారెడ్డి, హైదరాబాద్‌లోనే కొనసాగింది. అతడి తండ్రి ఉద్యోగ విరమణ తరువాత తన సొంత గ్రామం దుబ్బాకలోనే నివాసముంటున్నారు. తల్లిదండ్రుల కష్టం గుర్తించిన వెంకటేష్ సివిల్స్(ఐపీఎస్) సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. గతంలో నాలుగు సార్లు సివిల్స్ పరీక్షలు రాసినప్పటికీ క్వాలిఫై కాలేదు. దీంతో గ్రూప్-1పై దృష్టి పెట్టారు. ఎలాంటి కోచింగ్ లేకుండా రోజుకు 10 గంటల పాటు కష్టపడి ఈ విజయం సాధించానని వెంకటేష్ తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో గ్రూప్ 4 సాధించి సంగారెడ్డి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు అనంతరం మార్చిలో విడుదలైన జేఎల్‌ఫలితాల్లో సత్తా చాటిన అతడు ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఎలాగైనా సివిల్స్ సాధించి దుబ్బాక పేరు నిలబెడతానని ఆయన తెలిపారు.



వెంకటేష్

తొలి ప్రయత్నంలోనే విజయం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏదైనా సాధించాలనే తపన పట్టుదలతోపాటు తగిన విధంగా శ్రమిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని మెదక్‌కు చెందిన దొంత నిశ్రిత నిరూపించింది. గ్రూప్-1 ఫలితాల్లో 502.5 మార్కులు సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైంది. మెదక్ పట్టణానికి చెందిన దొంత నరేందర్, శిరీష దంపతులకు ఏకైన కుమార్తె నిశ్రిత. తండ్రి నరేందర్ నీటిపారుదల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుండగా.. తల్లి శిరీష గృహిణి. ఢిల్లీలోని లేడీ శ్రీరామ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె సివిల్స్ లక్ష్యంగా కోచింగ్ తీసుకుని తొలి ప్రయత్నంలోనే విజయం సాధించింది.



సచిన్ వరుసగా ర్యాంకులు..

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 1 ఫలితాల్లో సచిన్ 360 ర్యాంకు సాధించి ఎంపిడివో పోస్టుకు ఎంపికయ్యాడు. అలాగే మార్చిలో వెలువడిన గ్రూప్ 2 ఫలితాల్లో 2వ ర్యాంకు, ఇటీవల రిలీజైన గ్రూప్ 3లో 23వ ర్యాంకు సాధించాడు. సిద్దిపేటకు చెందిన వడ్లకొండ సుజాత, శ్రీనివాస్ రెడ్డి చిన్న కుమారుడైన వడ్లకొండ సచిన్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఐటీ జాబ్ మానేసి సివిల్స్‌కు ప్రిపేరవుతున్నాడు.



సచిన్

పట్టుదలతో చదివి..

జహీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువతులు గ్రూప్-1 ఉద్యోగాలు సాధించి పట్టుదలను నిరూపించుకున్నారు. జహీరాబాద్ దత్తగిరి కాలనీకి చెందిన దస్నూరు సాహితి పట్టణంలో ఇంటర్, సంగారెడ్డిలో డిగ్రీ పూర్తి చేసి గ్రూప్-1 పరీక్షలు రాసి కార్మిక శాఖ అధికారిణిగా నియమితులయ్యారు. తల్లిదండ్రుల సహకారం, భర్త ప్రోత్సాహంతో ఈ ఉద్యోగం సాధించినట్లు సాహితి తెలిపారు. న్యాల్కల్ మండలం మిర్జాపూర్ (బి)కి చెందిన అఖిలారెడ్డి పీజీ వరకు హైదరాబాద్‌లోనే చదువుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న ఆమె గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. తన విజయంపై ఆమెతో పాటు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



సాహితి



అఖిలారెడ్డి

తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద అంగన్‌వాడీల అరెస్టు

తూప్రాన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'చలో సెక్రటేరియట్' నినాదంతో హైదరాబాద్ వెళ్తున్న వివిధ జిల్లాల అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు తూప్రాన్ పట్టణం అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు. అంగన్‌వాడీ అసోసియేషన్ (సీఐటీయూ) పిలుపు మేరకు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి డిమాండ్లతో వారు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసనకు బయలుదేరారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్న అంగన్‌వాడీలను తూప్రాన్ పోలీసులు తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. తూప్రాన్ మండలానికి చెందిన ఆరుగురిని ఇళ్ల వద్దే ముందస్తుగా అరెస్టు చేశారు. టోల్‌ప్లాజా వద్ద మొత్తం 45 మంది అంగన్‌వాడీలను అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం తర్వాత వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల పరిహారం వివరాల సేకరణ

నర్సాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించే ప్రక్రియ వేగవంతంగా సాగుతున్నది. నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోని 17 గ్రామాల గుండా ట్రిపుల్ ఆర్ వెళుతుంది. ఆర్థిక శాఖ నుంచి మొదటి విడతగా ఐదు గ్రామాలైన పాంబండ (30 మంది రైతులు), తిర్మలాపూర్ (56), చిన్నచింతకుంట (18), గుండ్లపల్లి (21), నాగులపల్లి (31) రైతులకు పరిహారం కోసం అనుమతి లభించింది. వీరికి ఆర్డీవో కార్యాలయం నుంచి ఇప్పటికే నోటీసులు అందగా, ఆ రైతులు తమ భూమి పట్టా సర్టిఫికేట్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో అందజేస్తున్నారు. అధికారులు బోర్లు, చెట్లు వంటి వాటి వివరాలను కూడా సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ఆర్డీవో మహిపాల్ తెలిపారు.

శేషవాహన సేవ

గుమ్మడిదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదలలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా శేషవాహనంపై ఊరేగారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.

కుల నిర్మూలనే వీహెచ్‌పీ లక్ష్యం

- మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్

కంగ్టి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పాతుకుపోయిన కులవ్యవస్థ, అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించడమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కంగ్టిలోని బసవ ప్రదీప్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 'సామాజిక సమరసత సుహాసిని మహిళా పాదపూజ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాధు సంతులతో కలిసి 216 మంది ముత్తైదువులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ పట్టణాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉన్నా, గ్రామాల్లో కొన్ని వర్గాలను ఇంకా వెలివేసినట్లుగా చూడటం బాధాకరమని అన్నారు. ఇలాంటి దుస్థితిని తొలగించడానికి వీహెచ్‌పీ సుహాసిని పాదపూజ వంటి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. సనాతన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడేందుకు ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం భద్రాచలం విశ్వాత్మానందగిరి స్వామి మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని రక్షించుకోకపోతే హిందువుల మనుగడ కష్టమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, సర్వేశ్వరాంబిక శివయోగి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులు జగదీశ్వర్, ధనుంజయ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, అనుసూయరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, రాష్ట్ర నాయకులు రవిగౌడ్, శంకర్, రాంరెడ్డి, గీతారెడ్డి, మనోహర్, అంజనేయులు, సత్యనారాయణ, దత్తాత్రి, గంగారాం, సాయిరాం, నరేందర్, రజనీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.




మహిళలకు పాదపూజ చేస్తున్న స్వామీజీలు ఈటేల రాజేందర్

ఐఐటీహెచ్‌లో భవిష్యత్ తరం చిప్‌ల డిజైన్

- 75కుపైగా సెమీకండక్టర్ డిజైన్ల అభివృద్ధి
- మొబైల్ నావిగేషన్, డ్రోన్లు, రక్షణ వ్యవస్థల.. సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా రూపకల్పన
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధకుల ఘనత

కంది, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మొబైల్ నావిగేషన్, డ్రోన్లు, రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచగలిగే అత్యాధునిక చిప్‌లను ఐఐటీ హైదరాబాద్ అభివృద్ధి చేసింది. అత్యంత అధునికమైన సుమారు 75 సెమీకండక్టర్ చిప్ డిజైన్లను ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూపొందించారు. చాలా వరకు విదేశాలకే పరిమితమైన సెమీకండక్టర్ చిప్ డిజైనింగ్‌ను ఐఐటీహెచ్‌లో విజయవంతంగా నిర్వహించడం హర్షనీయమని శాస్త్రవేత్తలు ప్రశంసిస్తున్నారు. దీనికి సంబంధించి గురువారం ఐఐటీహెచ్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. అధునాతన ఇమేజ్ సెన్సర్ల నుంచి తదుపరి తరం చిప్‌ల వరకు అభివృద్ధి చేస్తూ.. సెమీకండక్టర్ పరిశోధన, శిక్షణ కేంద్రంగా ఐఐటీహెచ్ నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ చిప్‌లు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రిక్ కార్లు, అధునాతన వైద్య పరికరాల్లో వినియోగించేందుకు వీలుగా అభివృద్ధి చేశారని.. కృత్రిమ మేధస్సు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో పురోగతికి మార్గం వేస్తాయని తెలిపారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఐఐటీహెచ్ ముందంజలో ఉందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. వినూత్న టెక్నాలజీ ఉపయోగించి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ఉండే పరిశోధనలు జరుపుతున్నామని వివరించారు. ఐఐటీహెచ్ పరిశోధకులు ప్రపంచ స్థాయికి పరిశోధనలను విస్తరించడం గర్వకారణమని పేర్కొన్నారు.



ఐఐటీహెచ్ పరిశోధకులు అభివృద్ధి చేసిన చిప్‌లు

కాంగ్రెస్ గుణపాఠం తప్పదు : పీడీఎస్‌యూ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, నాగరాజు హెచ్చరించారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తయినా విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామని చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారిందని అన్నారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, జగన్నాథరావు, శ్రీకాంత్, నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గౌతమ్ కుమార్, మస్తాన్, అజయ్, ప్రణయ్, శ్రీనివాస్, ప్రదీప్, శ్యామ్, దీపాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం దాతలకూ మేలు చేస్తుంది'

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల దాతల్లో రక్తపోటు తగ్గుతుందని, కొత్త రక్తం ఉత్పత్తి అయి చురుకుగా ఉంటారని కేంద్ర ఔషధ నియంత్రణ మండలి అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ వినయ్ కుమార్ గుప్తా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాల ముగింపు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలాంటి పెద్ద దేశంలో కూడా ప్లాస్మాను దిగుమతి చేసుకోవడం విచారకరమని, సగం మంది ప్రజలు రక్తదానం చేసినా మనం రక్తాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఔషధాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. గీతం ఫార్మసీ అధ్యాపకుల కృషిని ఆయన అభినందిస్తూ, అది అగ్రస్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ టి.కుమారగురు, యశోద ఆసుపత్రి క్లినికల్ ఫార్మసిస్ట్ డాక్టర్ రేష్మా అజయ్ పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు. తొలుత స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ అతిథులను స్వాగతించి, సత్కరించారు. ఈ వేడుకలను డాక్టర్ సతీష్, డాక్టర్ పూజా మిట్టల్, ఇతర అధ్యాపకులు సమన్వయం చేశారు. వివిధ రకాలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న వినయ్ కుమార్ గుప్తా

'గీతం' విద్యార్థుల క్రీడా ప్రతిభ

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి స్మారక అంతర్ ప్రాంగణ క్రీడా పోటీల్లో హైదరాబాద్ ప్రాంగణం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నం, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంగణాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో గీతం హైదరాబాద్ జట్లు అథ్లెటిక్స్, టీం గేమ్‌లలో పతకాలు సాధించాయి. అథ్లెటిక్స్‌లో 100, 200, 1500 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ తదితర పోటీల్లో పతకాలు గెలుచుకున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో పురుషుల జట్లు, వాలీబాల్‌లో మహిళల జట్టు రజత పతకాలు సాధించాయి. కబడ్డీలో పురుషుల జట్టుకు స్వర్ణం, మహిళల జట్టుకు రజతం లభించింది. బ్యాడ్మింటన్, పికిల్‌బాల్‌లలో మహిళలు స్వర్ణం గెలుచుకోగా, పురుషులు రజతం సాధించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 33 మంది విద్యార్థులు సౌత్ జోన్ పోటీల్లో గీతం విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యారు.



గీతం అధ్యాపకులతో క్రీడాకారులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శారద



అవార్డు అందుకుంటున్న శారద

గుమ్మడిదల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వాకిట శారద 'నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్' అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని బిర్లా ప్లానెటోరియం భాస్కర ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. మూడు రాష్ట్రాల నుంచి ఎంపికైన 170 మందికి టీచర్లకు అందజేశారు. విద్యారంగానికి అంకితభావంతో సేవలు అందించినందుకు శారదకు ఈ గౌరవం లభించింది. ప్రముఖ హాస్యనటుడు రఘు చేతుల మీదుగా ఆమె 2025 సంవత్సరానికి ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ గౌరవం తనకే కాకుండా విద్యారంగానికి కృషి చేస్తున్న ప్రతి ఉపాధ్యాయునికి దక్కుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే నిజమైన బహుమతి అని ఆమె పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు

జహీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఒక ఆటో డ్రైవర్ కుమారుడు ఎంబీబీఎస్ సీటు సాధించాడు. జహీరాబాద్ మండలం, హోతి (బి) గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఇబ్రహీం కుమారుడు ఉబేద్, అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివాడు. తండ్రి కష్టాన్ని గుర్తించి కష్టపడి చదివి నీట్‌లో మంచి ర్యాంకు సాధించి, నాగర్‌కర్నూల్ వైద్య కళాశాలలో సీటు సంపాదించాడు. ఇదే పాఠశాల నుంచి మరో ఇద్దరు విద్యార్థులు గౌతమ్‌కన్నా (నిర్మల్ మెడికల్ కాలేజీ), సృజన్‌కుమార్ (ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ) కూడా ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్లు అధ్యాపకులు తెలిపారు.



ఉబేద్

పండుగలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దసరా, బతుకమ్మ పండుగలకు ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చేగుంట మండలం బోనాల గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలు దగ్గరపడ్డా గ్రామాల్లో ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగడం లేదన్నారు. గ్రామపంచాయతీలో నిధులు లేక కార్యదర్శులు చేతులెత్తేశారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతు చేయాలన్నా, గుంతల్లో మొరం పోయాలన్నా గ్రామపంచాయతీలో చిల్లి గవ్వ కూడా లేదని ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం బోనాల గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త నూతన ఫంక్షన్‌హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ చేగుంట, నార్సింగి మండలాల అధ్యక్షులు నారాయణరెడ్డి, కుమ్మరి బాబు, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, డిష్ రాజు, మహమ్మద్ అలీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల గ్రామంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పంచాయతీ కార్యదర్శుల సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ ఆవరణలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతూ గ్రామాలు ఎలాంటి సమస్యలు ఉన్నాయని తెలుసుకున్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామా పంచాయతీ కార్యదర్శి భూమేష్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అలాగే తమకున్న మూడు తులాల బంగారాన్ని కుదువపెట్టి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ కార్యదర్శులు గ్రామాలు అభివృద్ధి చేయడంపై అభినందించారు. అనంతరం కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో అధికారులతో మాట్లాడారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు గౌరీశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.



కొల్చారంలో సీఎంఆర్‌ఎఫ్‌చెక్కులు పంపిణీ చేస్తున్న సునీతారెడ్డి

మధ్యవర్తిత్వం లేకుండానే సీఎంఆర్‌ఎఫ్ సాయం

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ సాయం అందిస్తున్నట్టు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి పట్టణ, మండలం, కంది, కొండాపూర్ మండలాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు రూ.14,28,500 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీఈ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీలు మనోహర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, పాండు, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, నర్సింలు, చక్రపాణి, మధుసూదన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, మ్యాకం విఠల్ పాల్గొన్నారు.

బధిరులు మన సమాజంలో భాగమే

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బధిరులు మన సమాజంలో భాగమేనని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రపంచ బధిరుల వారోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజంలో బధిరులకు సమాన గౌరవం, అవకాశాలు పొందే హక్కు కలిగి ఉంటున్నారు. బధిరులు శారీరక లోపం ఉన్నప్పటికీ జీవితంలో విజయాలను ఆపలేదని అనేకమంది తమ ప్రతిభను చూపిస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం బధిరులకు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ, ఆర్‌ఎంవోలు వీరాంజనేయులు, రవికుమార్, డీఐవో డా.శశాంక్, ఈఎన్‌టీ వైద్యులు డా.భవ్య, డా.సమీనా, ఈఎన్‌టీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



సంగారెడ్డి జీజీహెచ్‌లో బధిరులకు బహుమతులు అందజేస్తున్న సౌజన్య

నియోజకవర్గాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం : మహిపాల్‌రెడ్డి



క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించిన మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఫాతిమా, కీర్తన, ఆకాంక్ష, లావణ్య, స్వీతిక తమిళనాడులో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఇందుకు కావాల్సిన రూ.70 వేలు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్‌రెడ్డి, అమీన్‌పూర్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, అశోక్, పరమేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

సంగారెడ్డి రూరల్/సంగారెడ్డి అర్బన్/టేక్మాల్, సెప్టెంబరు.25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఇందులో కలెక్టర్ ప్రావీణ్య గౌరమ్మతల్లికి పూజలుచేసి వివిధ రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌వో పద్మజారాణి, వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. డీఎం ఉపేందర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. టేక్మాల్ మండలంలోని పల్వంచ, బర్దిపూర్ గ్రామాల్లో అట్ల బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడలికి తీసుకొచ్చి ఆడిపాడారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, మహిళా అధికారులు, ఉద్యోగులు

చిరుధాన్యాలతోనే మెరుగైన ఆరోగ్యం

పుల్‌కల్/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాలతోనే మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని, తద్వారా జీవన ప్రమాణాలు మరింతగా పెంపొందుతాయని జోగిపేట ఐసీడీఎస్ సీడీపీవో ప్రియాంక అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో గురువారం పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. పోషకాలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల రక్తహీనతను నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖానా డాక్టర్ హరిహరణ్, ఆయుర్వేద డాక్టర్ సబిత, ఐసీడీఎస్ పర్యవేక్షకులు అమృతవాణి, అంజుమ్, జీపీవో సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని పూసలపల్లి గల్లీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, సుక్కమ్మ, విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ వ్యవస్థలో పదోన్నతితో విధుల పట్ల బాధ్యత మరింత పెరుగుతుందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. చిన్నశంకరంపేట పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న టీ.నర్సింహులు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో గురువారం ఎస్పీని కలిసి పూలబొకే అందజేశారు.

ఎన్‌ఐ ఫోరం జాతీయ కార్యదర్శిగా జ్ఞానేశ్వర్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేటివ్ ఇండియన్స్ ఫోరం పర్యావరణ విభాగం(ఎన్‌ఐ) జాతీయ కార్యదర్శిగా జ్ఞానేశ్వర్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బీరయ్యయాదవ్ గురువారం సంగారెడ్డిలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీరయ్య యాదవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు జ్ఞానేశ్వర్ సమాజానికి ఆదర్శమని అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

అల్లాదుర్గం/చేగుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పోలీసులకు సూచించారు. గురువారం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసుల దర్యాప్తు చేపట్టి త్వరతగతిన పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐ శంకర్ పాల్గొన్నారు. అలాగే నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ తనిఖీ చేశారు. కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ బీమరి సృజన, ఏఎస్‌ఐ మిస్బాఉద్దీన్, రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవతో గ్రామాల అభివృద్ధి



శివంపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి

పుల్‌కల్/నారాయణఖేడ్/నర్సాపూర్/జిన్నారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవతో గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని పుల్కల్, చౌటకూర్ మండలాల ప్రత్యేకాధికారులు బాలరాజ్, వసంతకుమారిలు అన్నారు. ఎక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ముదిమాణిక్యం, శివంపేట గ్రామాల్లో నిర్వహించిన శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ చౌటకూర్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, నాయకులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలం బాచేపల్లిలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్, ఎంపీడీవో సంగ్రాం మాట్లాడారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని తహసీల్ మైదానంలో గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో ఏక్‌దిన్, ఏక్ గంట, ఏక్ సాత్, పేరిట వాకర్స్ యువజన సంఘాల అసోసియేషన్ల సభ్యులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు స్వచ్ఛత పనులు చేపట్టారు. నర్సాపూర్ రాయరావుచెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. గడ్డపోతారంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల సమీపంలో ఉన్న చెత్తను మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి తొలగించారు. జిన్నారంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో పల్లె వనంలో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా పండిత్ దీన్‌దయాల్ జయంతి

సంగారెడ్డి అర్బన్/నర్సాపూర్/గుమ్మడిదల/కల్హేర్/సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పండిత్ దీన్‌దయాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా కన్వీనర్ వెంకటనరసింహారెడ్డి, డా.రాజుగౌడ్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. నర్సాపూర్‌లో పండిట్ దీన్‌దయాల్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్ యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు నగేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం ప్రకృతి నివాస్‌లో దీన్‌దయాల్ జయంతి నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ సేవా సంఘం నాయకులు డాక్టర్ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్‌లో దీన్‌దయాల్ జయంతిని మహంకాళీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.



సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రైతుల వ్యవసాయాధారాన్ని లాక్కోవడం సరికాదు

కొండాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాత ముత్తాతల కాలం నుంచి నేటివరకు వ్యవసాయమే కుటుంబ జీవనాధారంగా బతుకుతున్న రైతుల భూముల నుంచి ట్రిపుల్‌ఆర్ రోడ్డు వేస్తాయనడం నోటికాడికూడు లాక్కోవడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ఆరోపించారు. గురువారం మారెపల్లి, మాచెపల్లి గంగారం రెవెన్యూ గ్రామాల ట్రిపుల్‌ఆర్ భూబాధిత రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ట్రిపుల్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేరుమోసిన నాయకుల, బడా వ్యాపారుల భూములు కాపాడేందుకు వ్యవసాయమే అధారంగా బతుకుతున్న రైతుల భూములను లాక్కోవడం సరికాదన్నారు. ఈ విషయమై 27న సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడి ఉన్నదని, రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మాణిక్, కమిటీ సభ్యుల కృష్ణ, రాజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫైల్స్ పెండింగ్‌లో ఉండొద్దు: ఆర్డీవో

నర్సాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో ఆయా మండలాల్లో తహసీల్దార్ కార్యాలయంలో వివిధ సమస్యలపై ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ సూచించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సాదాబైనామా, అసైన్డ్ భూములు, రెవెన్యూసదస్సులు, భూభారతి దరఖాస్తులు, వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు, మీ సేవ సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మి, ట్రిబుల్ ఆర్ సంబంధించిన సమస్యలపై ఆయా మండలాల వారిగా సమీక్షించి తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు.

సమస్యల గుర్తింపునకు బస్తీదర్శన్ : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ఎదురవుతున్న సమస్యలు గుర్తించేందుకు అధికారులతో పర్యటనలు జరుపుతున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ పరిధి సాయినగర్ కాలనీలో బస్తీదర్శన్ కార్యక్రమం నిర్వహించారు. కరెంటు సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో కరెంటు స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇంటర్నెట్ కేబుల్స్ వేయడం వల్ల నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ భాస్కర్‌రావు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, బ్రహ్మరాజు, రాజ్‌కుమార్, నాగేశ్వరరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

మానవత్వమే గొప్ప భక్తి : గంగారం



నిజాంపేట మండలం బాచేపల్లి రాధాస్వామి సత్సంగ్ సహజయోగ్‌లో ప్రవచనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఆచార్యులు

కల్హేర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానవత్వమే గొప్ప భక్తి అని కామారెడ్డి జిల్లా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, ఓంశాంతి సంస్థ ప్రతినిధి సౌదాగర్ గంగారాం, ఆచార్యులు క్రిష్ణయ్య మహరాజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి శివారులోని రాధాస్వామి సత్సంగ్ సహజయోగ్‌లో గురువారం సత్సంగ్ వ్యవస్థాకులు సంత్ ముకుందరెడ్డిమహరాజ్ జయంతిని నిర్వహించారు. సత్సంగ్‌లో పాల్గొన్నవారు భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోత్స్న మాతాజీ, గంగాధర్ మహరాజ్, సత్సంగ్ సహజయోగ్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నిజాంపేట మండల అధ్యక్షుడు డి.శంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశం, కాంగ్రెస్ కల్హేర్ మండల అధ్యక్షుడు పోచయ్య, నాయకులు అంజిరెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన సత్సంగ్ భక్తులు పాల్గొన్నారు.

పరిశీలించకుండానే పట్టాను ఎలా మారుస్తారు?

కోహీర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం కవేలి గ్రామంలోని ఓ భూమికి సంబంధించి పట్టా మార్పు విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పుడు పట్టా మార్పు చేశారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయమై గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారులను ప్రశ్నించారు. 50 ఏళ్ల క్రితం గ్రామస్థులకు ఇళ్ల నిర్మాణం కోసం భూ యజమాని తన 1.30 గుంటల భూమిని అమ్మితే 50 ఏళ్ల తర్వాత భూమి అమ్మిన వ్యక్తి వారసులమని చెప్పి తప్పుడు ఆధార్‌కార్డు, ఇతరత్రా ధ్రువపత్రాలు జతపరిచి భూమిని పట్టా మార్పు కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు సమాచారం లేకుండా పట్టా మార్పు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ తగిన న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు..

రూ.15 కోట్లతో అన్నివిధాల అభివృద్ధి

● పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్

నర్సాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఇక అన్నివిధాల అభివృద్ధి జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని రాయరావుచెరువు, కోమటికుంట సుందరీకరణతో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించేందుకు నిర్ణయించడం హర్షణీయమన్నారు. నిధులు వచ్చేలా కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డితో పాటు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆర్టీసీలో ప్రయాణిస్తే నగదు బహుమతులు

జహీరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే నగదు బహుమతులను అందిస్తామని డిపో మేనేజర్ స్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి అక్టోబరు 6 వరకు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులు టికెట్ వెనుక భాగంలో అడ్రస్‌నురాసి బస్టాండ్లలో ఏర్పాటుచేసిన డ్రాబాక్స్‌లో వేయాలన్నారు. అక్టోబరు 8న రీజినల్ ప్రాంతీయ కార్యాలయంలో డ్రా తీస్తారన్నారు. అందులో ప్రథమ విజేతకు రూ.25 వేలు, ద్వితీయ విజేతకు రూ.15 వేలు, తృతీయ విజేతకు రూ.10వేల చొప్పున నగదును ఇస్తామన్నారు.

అల్లీపూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ అల్లీనగర్ 27 సర్వే నెంబరులో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన పలు బేస్‌మెంట్లను ఆర్‌ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్ల సహాయంతో గురువారం కూల్చేయించారు.

ఓల్డేజ్ హోం, డే కేర్ సెంటర్ వలంటీర్స్‌కు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి ఆధ్వర్యంలో నడుపుతున్న ఓల్డ్ ఏజ్ హోం, డే కేర్ సెంటర్‌లో పనిచేసేందుకు మల్టీ టాస్క్ వలంటీర్లను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా చైర్మన్ వనజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సర కాలానికి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు కో ఆర్డినేటర్స్ ఏఎన్‌ఎం, సోషల్ వర్కర్, సూపరింటెండెంట్, డాక్టర్, కుక్ అవసరముందని తెలిపారు. సేవా దృక్పథం కలిగిన వారు అక్టోబరు 1 న సంగారెడ్డి మంజీరానగర్‌లోని అంబేడ్కర్ భవన్ పక్కనున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు.

ఈ నెలాఖరు వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీవరకు అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యాసకులు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందాలని సూచించారు. వివరాలకు 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా ఫార్మసీ దినోత్సవం

నర్సాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫార్మసీ దినోత్సవం పురస్కరించుకుని నర్సాపూర్ పట్టణంలో విష్ణు ఫార్మసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీ ప్రాముఖ్యత ప్రయోజనాలను వివరిస్తూ చేపట్టిన ర్యాలీ గాంధీ విగ్రహం నుండి ప్రధాన రోడ్డుపై ఉన్న చౌరస్తా వరకు సాగింది.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి నుంచి మెదక్ వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరీ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం వెల్దుర్తి-మెదక్ ప్రధాన రహదారిపై ఆయన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్టు

అల్లాదుర్గం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ తరలివెళ్తున్న అల్లాదుర్గం అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

అల్లాదుర్గం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని గ్రామపంచాయతీ కార్యదర్శి అనిత సూచించారు. గురువారం అల్లాదుర్గం మండలంలోని సీతానగర్ గ్రామపంచాయతీ పరిధి గిరిజనతండాలో ఆమె, అంగన్‌వాడీ టీచర్లు చీపుర్లు పట్టి రహదారులను శుభ్రం చేశారు.